'గాలికుంటు' కట్టడికి 'టీకా'

- పశువులకు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టిన పశువైద్యులు
- ముమ్మరంగా వ్యాక్సినేషన్
- గ్రామాలకు వెళ్లి టీకా వేస్తున్న డాక్టర్లు, సిబ్బంది
- సంతోషం వ్యక్తం చేస్తున్న పాడిరైతులు



గాలికుంట్ల వ్యాధికి టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది (ఫైల్)

బనగానపల్లె: పశువుల ప్రాణాలు బలితీసుకునే గాలికుంటు వ్యాధి కట్టడికి అధికారయంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వాతావరణ మార్పులు జరిగే సమయంలో పశువులు ఈ వ్యాధి బారిని పడుతుంటాయి. పాడిరైతులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా పశువులు ప్రాణాలకే ముప్పువాటిల్లుతుంది. ఈ మహమ్మారి మూలంగా పశువులు మృత్యువాతపడడంతో ఎంతోమంది రైతులు తీవ్రంగా నష్టపోతుంటారు. జీవాలకు ఈ వ్యాధి సోకితే ప్రాణ నష్టం మరీ తీవ్రంగా ఉంటుంది. ఈ నష్టాలను అరికట్టేందుకు అధికారయంత్రాంగం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. గాలికుంటు వ్యాధి సోకకుండా పశువైద్యులు ముందస్తుగా పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాలకు వెళ్లి మరీ టాకాలు వేస్తున్నారు పశువైద్యులు, సిబ్బంది. నంద్యాల జిల్లాలో 15 ప్రాంతీయ పశువైద్యశాలలు, 74 పశువైద్య కేంద్రాలు, 99 గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. ప్రస్తుతం 16,02,698 పశుసంపద ఉన్నట్లు సంబంధిత శాఖ జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. గాలికుంటు వ్యాధి కట్టడికి టీకాలు వేసేందుకు 87 బృందాలు గ్రామాల్లో పర్యటిస్తున్నాయి. గ్రామాలకు వెళ్లి టీకాలు వేయడంతో పశుసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పాడిరైతులను చైతన్యపరుస్తున్నారు. ఏడాదికి రెండుసార్లు గాలికుంటు వ్యాది టీకాలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు పశువైద్యులు. దీంతో పాడిరైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

60 శాతం వ్యాక్సినేషన్ పూర్తి

పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నెల పాటు చేపట్టిన వ్యాక్సినేషన్ దాదాపు 60శాతం పూర్తి చేసినట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. పశువైద్యులు మార్చి ప్రారంభంలో వ్యాక్సినేషన్ చేపట్టారు. ప్రతి పశువైద్యశాల పరిధిలో సిబ్బంది గ్రామాల వారీగా పశువులకు ట్యాగ్‌లను వేయడం జరిగింది. ఈ మేరకు ట్యాగ్‌ల ఆధారంగా పశువులకు టీకాలు వేస్తున్నారు పశువైద్యులు, సిబ్బంది. పశువులకు ట్యాగ్‌లు వేయించుకోని రైతులకు సూచనలు చేస్తున్నారు. ట్యాగ్ ప్రయోజనాలు వివరిస్తూ చైతన్యపరుస్తున్నారు సిబ్బంది. టీకా కార్యక్రమం ఏప్రిల్‌లోనూ కొనసాగిస్తామని ఆ శాఖ అధికారులు తెలిపారు.

జిల్లాలో పశుసంపద వివరాలు

పశువులు	సంఖ్య
ఆవులు, ఎద్దులు	1,20,565
బర్రెలు	2,93,830
గొర్రెలు	8,82,449
మేకలు	3,05,854

వ్యాధి లక్షణాలు :

పశువుల నోటి నుంచి చొంగ కారడం ప్రారంభమవుతుంది. 105 డిగ్రీల జ్వరం వస్తుంది. ఆహారం తీసుకోవు. నోరు, కాలిగిట్టల్లో పుండ్లు ఏర్పాడతాయి. ఈ వ్యాధి సోకిన పశువులు ఎండలో ఎక్కువ సేపు ఉండలేవు. ఈ వ్యాధి ఉన్న పశువుల పాలు తాగితే దూడలు మరణించే అవకాశం ఉంది.

నివారణ చర్యలు

వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి గుంపు నుంచి వేరు చేయాలి. వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి. పెన్సిలిన్ యాంటి ఇష్టమిన్, యాంటి ఇన్ల మెటరీ డ్రగ్స్ వాడాలి. నోటీలో కాలిగిట్టల మధ్య గ్లిసరిన్‌తో శుభ్రం చేసి గోటికి పౌడర్ పట్టించాలి. ముందస్తుగా ఎఫ్ఎండీ ఇన్‌జెక్షన్ వేయించాలి.

పశువైద్యుల సూచనలు ఉపయోగకరం



పశువైద్యుల సూచనలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రత్యేకించి గాలికుంటు వ్యాధి కట్టడికి వారు తీసుకుంటున్న ముందస్తు చర్యలు అభినందనీయం. ఆరునెలలకు ఓసారి ఈ కార్యక్రమం చేపడుతూ పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు. పశువైద్యులకు పాడిరైతుల తరపున కృతజ్ఞతలు. - పీబీ హరికృష్ణయాదవ్, పాడిరైతు, నందవరం

పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి



పశువులకు గాలికుంటు వ్యాధి సోకక ముందే పాడిరైతులు అప్రమత్తమై టీకాలు వేయించాలి. పశువులకు సంబంధించిన అన్ని రకాల మందులు ఆసుపత్రుల్లో ఉన్నాయి. పశువు అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే వెంటనే పశువును ఆసుపత్రికి తీసుకెళ్లాలి. - మారుతిసకారామ్, పశుసంవర్ధకశాఖ ఏడీ,బనగానపల్లె

క్లుప్తంగా

ధోబీ ఘాట్ల నిర్మాణ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి

కొలిమిగుండ్ల: పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం బెలుంలో రజకులకు ధోబీ ఘాట్ల నిర్మాణంతో పాటు ఎస్సీ, ముస్లింల శ్మశాన వాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను ట్రస్ట్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. రజకుల సౌకర్యార్థం బట్టలు ఉతికేందుకు తమ ట్రస్ట్ తరపున బోరు వేసి ధోబీ ఘాట్లు నిర్మిస్తున్నామని చైర్మన్ తెలిపా రు. అదేవిధంగా శ్మశాన వాటికల్లో కంప చెట్లు పెరిగి అస్తవ్యస్తంగా మారడంతో పొక్లెయినర్ వాటిని తొలగించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోతిరెడ్డి మహేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ చేరెడ్డి నాగిరెడ్డి, సాయినాథరెడ్డి,విష్ణువర్ధన్‌రెడ్డి, పెద్ద సాయిబాబా, మారం చిన్న ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీ జ్యోతి ఉత్సవాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీ దేవి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున జ్యోతి మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృతాభిషేకం, కంకుమార్చన, మహా మంగళహారతి సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పాఠశాలలకు కంప్యూటర్ల అందజేత



చింతలాయిపల్లె స్కూల్‌కు కంప్యూటర్ అందజేసిన దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లె, కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు రామ్‌కో సిమెంట్ కంపెనీ సామాజిక బాధ్యత కింద రూ.1.60 లక్షల విలువ కంప్యూటర్లు, ప్రింటర్లను కంపెనీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు అందజేశారు. అదేవిధంగా రెండు పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, రామ్‌కో జనరల్ మేనేజర్ రవికుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

5న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

డోన్ టౌన్: పట్టణంలోని రెవెన్యూ క్వాటర్స్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఈ నెల 5వ తేదీన (బుధవారం) ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గ్రేస్ సెలెస్టియల్ తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంలో దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసుకోవచ్చు అన్నారు. వాత రోగాలు, పక్షవాతం, కీళ్ల వాపులు, ఉదర సంబంధిత వ్యాధులు, అస్తమా, ఆయాసం తదితర వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని, వీటి వలన ఏలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. అదేవిధంగా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా యోగా టీచర్లతో యోగా నేర్పుతున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

బేతంచెర్ల: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి సూచించారు. పట్టణంలోని సంజీవనగర్ కాలనీల్లో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి 17 జట్లు పాల్గొనగా యువకుల ఈలలు, కేరింతల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో నిర్వాహకులు నాగరాజు, రమణ, పురుషోత్తం, బ్రహ్మనాయుడు, నిరంజన్, రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శంఖు చక్రం విరాళం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె: మండలంలోని పలుకూరులో వెలసిన చెన్నకేశవస్వామికి ఆ గ్రామంలోని పీహెచ్‌సీలో పీహెచ్ఎన్‌గా విధులు నిర్వహించే నాగేశ్వరి, విజయమనోహర్ దంపతులు రూ.50 వేలు విలువ శంఖుచక్ర నామాలను సమర్పించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి చేతుల మీదుగా శంఖుచక్ర నామాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం గుండం శేషిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్వర రెడ్డి, వడ్డెవెంకటేష్, రాఘవయ్య పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్ఎఫ్ఓ భూపాల్‌రెడ్డి

డోన్ టౌన్: స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం రీజినల్ అగ్నిమాపక శాఖ అధికారి భూపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. యంత్రాలు, సిబ్బంది వివరాలు డోన్ శాఖ అధికారి రంగస్వామిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం పరిధిలో చోటు చేసుకున్న ప్రమాదాలు గురించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు సకాలంలో స్పందించాలని, నష్టం జరుగకుండా ప్రయత్నించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన ట్రాన్స్‌కో ఏఈ

కొలిమిగుండ్ల: ట్రాన్స్‌కో ఏఈగా ప్రసన్న ఆంజనేయులు శుక్రవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఈగా పని చేసిన శ్రీనివాసులు రెండేళ్ల క్రితం బనగానపల్లెకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అవుకు ఏఈ ఫక్కీరయ్య ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఎట్టకేలకు రెండేళ్ల తర్వాత ఉన్నతాధికారులు ఎమ్మిగనూరు నుంచి ప్రసన్న ఆంజనేయులును కొలిమిగుండ్ల ఏఈగా నియమించారు.

నేడు వాహనాల వేలం

బనగానపల్లెరూరల్: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం కేసుల్లో సీజ్ చేయబడిన నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగే వేలంలో ఆసక్తిగల వ్యక్తులు పాల్గొన్నాలని ఎస్ఐ తెలిపారు.

గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీరు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 330 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకం ద్వారా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి జూలై నాటికి బేతంచెర్ల పట్టణానికి తాగునీరు అందించడం జరుగుతుందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా కాలనీల్లో చేపట్టే పనులు, చేసిన అభివృద్ధి పనులను కమిషనర్ రమేష్ బాబు వివరించారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్, ఖర్చు, మిగులు వివరాలను తెలిపారు. చైర్మన్ చలం రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామని, సీసీ రోడ్లు డ్రైనేజీ కాల్వల సమస్యలను పరిష్కరించామని గుర్తు చేశారు. మంత్రి బుగ్గన చొరవతో రూ.33 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల మంజూరైందని, ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభం అవుతాయన్నారు. అలాగే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కూడా మంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, వార్డు కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, మధు,షేక్ ముబీనా, వెంగమ్మ, మహేశ్వరీ, నాగజ్యోతి, టీపీ అంజద్ బాషా, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ నాయక్, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, మెప్మా కోర్డినేటర్ మల్లికార్జున, సీనియర్ అకౌంటెంట్ సురేఖ పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే ఉద్యమిస్తాం

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే ఉద్యమిస్తామని ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షులు అజాంబేగ్ హెచ్చరించారు. శుక్రవారం స్థానికి ఎస్టీయూ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది 10వ తరగతి పరీక్షలో మాల్ ప్రాక్టీస్ జరిగిందన్న కారణంగా ఉపాధ్యాయులపై కేసులు పెట్టగా ఎనిమిది నెలల తర్వాత నవంబర్ నెలలో న్యాయస్థానం ఉత్తర్వులతో వారు తిరిగి మారుమూల ప్రాంతాలలో విధులలో చేరారు. కుటుంబాలకు దూరంగా చేయని నేరానికి శిక్ష అనుభవిస్తున్నారు. ఈసంవత్సరం 10వ తరగతి పరీక్ష రోజుల్లో ప్రతి రోజు సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో ఉండి రిపోర్టు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడం చాలా అన్యాయం అని, ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగించనట్లుగా కనిపిస్తుందన్నారు. ఉత్తర్వులను రద్దు చేయాలని, లేని పక్షంలో పది పరీక్షలను బహిష్కరించడానికి వెనుకాడమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నాగేశ్వర నాయక్, మల్లేశ్వరుడు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



హాజరైన పొదుపు మహిళలు

- స్త్రీల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు
- మూడవ విడత ఆసరా కింద రూ. 28.29 కోట్లు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం ద్వారా మహిళా సాధికారత సాధించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా మూడవవిడత సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడంతోపాటు సున్నావడ్డీ చెల్లిస్తున్నారన్నారు.ప్రతిమహిళను లక్షాధికారినిచేయడమే సీఎం ధ్యేయమన్నారు.చంద్రబాబు హయాంలో ఇదే బడ్జెట్ ఉన్నప్పటికీ కమీషన్ల కోసం ప్రజలకు అన్యాయం చేశారని, అదే బడ్జెట్‌తో ప్రస్తుత జగనన్న అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు తదితర పథకాలను వర్తింపచేస్తూ అండగా నిలుస్తున్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాటసాని పిలుపునిచ్చారు.

4,282 పొదుపు సంఘాలకు రూ. 28.29 కోట్ల లబ్ధి

వైఎస్సార్ ఆసరా మూడవ విడత కార్యక్రమం ద్వారా బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 4,282 పొదుపు గ్రూపులకు రూ. 28.29 కోట్లతో లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. కోవెలకుంట్ల మండలంలో 655 గ్రూపులకు రూ. 3.74 కోట్లు, బనగానపల్లె – 1,499 గ్రూపులకు రూ. 10.79 కోట్లు, కొలిమిగుండ్ల – 915 గ్రూపులకు రూ. 4.95 కోట్లు, అవుకు – 573 గ్రూపులకు రూ. 3.37 కోట్లు, సంజామల మండలంలో 640 గ్రూపులకు రూ. 5.43 కోట్లు విడుదలయ్యాయని వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీపీ శేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, బాలమద్దిలేటి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓపీఆర్ రాధిక, వైకేపీ ఏపీఎం గురుస్వామి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, అమడాల శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, నాట్ల వెంకటేశ్వరరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హరినాథరెడ్డి, దశరథరామిరెడ్డి, వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, దేవరాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

పరీక్షలకు సిద్ధం కావాలి

బనగానపల్లెరూరల్: పది విద్యార్థులు ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని ప్రముఖ మానసిక వికాస నిపుణులు డాక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. శుక్రవారం రామతీర్థం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుబ్బన్న అధ్యక్షతన 'విద్యార్థులు–విద్యా మనోవికాసం' అనే అంశం పై సమినార్ జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానం చేరుకోవాలనే పట్టుదలతో చదవాలన్నారు. అనంతరం డాక్టర్ కిశోర్‌కుమార్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, సురేంద్ర, సుధాకర్, బద్రీనాథ్, పుల్లమ్మ, వెంకటస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్,పెన్నుల పంపిణీ

బనగానపల్లెరూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని బీసీ బాలుర సంక్షేమ శాఖ వసతి గృహంలో వార్డెన్ మునిరాజు సొంత నిధులతో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు, స్కేల్, కంపాక్స్‌లను శనివారం పంపిణీ చేశారు. శ్రద్ధగా పరీక్షలు రాసి మార్కులు సాధించాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సూచించారు.

చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుదాం

బేతంచెర్ల: చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దుదామని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, మెప్మా కోర్డినేటర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి పొదుపు మహిళలు, సిబ్బంది పరిసరాల శుభ్రత పాటించాలని నినాదాలు చేస్తూ ప్రధాన వీధిలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మన వీధులు, మనపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అన్నారు.

తాత్కాలిక బస్‌షెల్టర్, చలివేంద్రం ప్రారంభం

డోన్: నిత్యం రద్దీగా ఉండే డోన్, బేతంచెర్ల ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌షెల్టర్, చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ శుక్రవారం ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక షెల్టర్, చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పోస్టుపసాద్, మున్సిపల్ వైఎస్ చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు బుర్రు రమాదేవి, మహేశ్వర రెడ్డి, నాయకులు బుర్రు శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

కొలిమిగుండ్ల: శ్రీరామ నవమి పండుగ సందర్భంగా కనకాద్రిపల్లెలో నిర్వహించిన ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీఆర్ రామిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. నంద్యాల, అనంతపురం జిల్లాకు చెందిన మహీంద్రా ట్రాక్టర్స్ షోరూంల సహకారంతో గెలుపొందిన వారికి వరుసగా రూ. 10వేలు, రూ.5వేలు, రూ.3వేలు,రూ.2 వేలు చొప్పున అందించారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేత ప్యాపిలి

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని గ్రామస్తులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. హోరా హోరీగా సాగిన పోరులో చివరకు ప్యాపిలి మండలం జట్టు ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకుంది. అదేవిధంగా రెండవ, మూడవ, నాల్గవ స్థానాల్లో జోహరాపురం, బండి ఆత్మకూరు, నంద్యాల మహాబలి జట్లు నిలిచాయి. విజేత జట్లకు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ. 8వేలు, రూ. 4వేల చొప్పున అందజేశారు.

ఎస్టీలకు రిజర్వేషన్ శాతం తక్కువ

డోన్ టౌన్: ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీలో ఎస్టీలకు రిజర్వేషన్ 6శాతం అతి తక్కువగా ఉందని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటా రాముడు, జాతీయ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు గుర్తు చేశారు. ఇటీవల అసెంబ్లీలో బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని అని కోరుతూ నాయకులు శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిరసన తెలిపారు. బస్సులను అడ్డుకున్నారు.పోలీసులు నిరసన కారులను అదుపులోకి తీసుకుని బస్సు సర్వీసులకు ఆటంకం కలుగకుండా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్, ఎన్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ పోస్టర్ల విడుదల

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం స్థానిక మోటార్ యూనియన్ వర్కర్స్ కార్యాలయంలో నాయకులు విడుదల చేశారు. నాయకులు కొండన్న, లక్ష్మన్న, మహానంది పాల్గొన్నారు.

మోటార్ వైండింగ్ షాపులో చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ ఎదురుగా ఉన్న మోటార్ రీవైండింగ్ షాపులో చోరీ జరిగినట్లు మెకానిక్ లక్ష్మన్న శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి పనులు ముగించుకుని తాళం వేసి వెళ్లగా గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారన్నారు. మోటార్ రీవైండింగ్ కోసం తెచ్చుకున్న రూ. 2 లక్షల విలువైన 80 కేజీల వైర్‌ను దోచుకెళ్లారని చెప్పారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు లక్ష్మన్న తెలిపారు.

కోలుకోలేక మహిళ మృతి

బనగానపల్లెరూరల్: గోర్లగుట్ట మండలంలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(37) చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు. మృతురాలు గురువారం మిరప పంట కూలీపని నిమిత్తం ఇల్లూరు కొత్తపేట గ్రామానికి వెళ్లి సాయంత్రం ఆటోలో ఇంటి వస్తుండగా బత్తులూరుపాడు సమీపాన అయ్యప్పస్వామి ఆలయం వద్ద ప్రమాదవశాత్తు వాహనంలో నుంచి జారి పడింది. కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి భర్త వెంకటరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వాహా నిధుల రికవరీపై దృష్టి సారించాలి

- మస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలి
- పీడీ రామచంద్రారెడ్డి



సామాజిక తనిఖీలో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో స్వాహా అయిన నిధుల రికవరీపై అధికారులు దృష్టి సారించాలని ఆ పథకం పీడీ రామచంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పథకం, పంచాయతీరాజ్, సర్వశిక్ష అభియాన్ కింద రూ. 3.25 కోట్లతో చేపట్టిన పనులు, సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపై పీడీతోపాటు అడిషనల్ పీడీ సలీంబాషా, ఏపీడీ సాంబశివరావు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ రాజ్ పనుల్లో రూ. 1.74 లక్షలు, ఉపాధిలో రూ. 14,702 రికవరీకి ఆదేశించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గతంలో జరిగిన సామాజిక తనిఖీల్లో మండలంలో రూ. 1.78 లక్షలు రికవరీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ. 27 వేలు మాత్రమే వసూలు అయిందన్నారు. పదిహేను రోజుల్లో మిగిలిన మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. పనుల వద్ద కూలీల హాజరులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మస్టర్లలో కొట్టివేతలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఏపీఓ శ్రీవిద్య, టెక్నికల్ అసిస్టెంట్లు జయభారత్‌రెడ్డి, కొండయ్య, బషీర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొలిమిగుండ్లలో ఉపాధి పనులపై బహిరంగ సభ

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండలంలో 01-04-2021 నుంచి 31-03-2022 వరకు పారంపండ్స్‌తో పాటు వివిధ పనులు చేపట్టారు. కూలీల కోసం రూ. 5.94 కోట్లు, మెటీరియల్ కోసం రూ.4.20 కోట్ల చొప్పున ఖర్చు చేశారు. ఈ పనులపై సామాజికి తనిఖీ బృందం సభ్యుల వారం రోజుల పాటు చేసిన పని ప్రదేశాలతో పాటు కూలీలను విచారించారు. డ్వామా అడిషనల్ పీడీ సలీం బాషా హాజరై 22గ్రామ పంచాయితీల్లో జరిగిన పనులపై రికార్డులు పరిశీలించారు. కూలీలతో పాటు ప్రజా ప్రతినిధుల నుంచి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల్లో పని ప్రదేశంలో బోర్డులు ఏర్పాటు చేయలేదని తనిఖీలో బయటపడింది. ఉపాధి సిబ్బంది నుంచి రూ.19.900 రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి,ఎంపీడీఓ సుబ్బరాజు, భాస్కర్‌నాయుడు,ఏపీడీ సాంబశివరావు, ఏపీఓ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రాములోరి కల్యాణం

డోన్ టౌన్: శ్రీరామ నవమి పర్వ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని కమలాపురం, గోసానిపల్లె, సోంపురం, కోట్లవారిపల్లె, ధర్మారం, కొచ్చెర్వు తదితర గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఆయా గ్రామాల్లోని పెద్దల సమక్షంలో స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కమలాపురం గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జబర్దస్త్ గడ్డం నవీన్, వినోదణీల హాస్య నాటికలు ఆకట్టుకున్నాయి.

సీతారాములకు గ్రామోత్సవం

బేతంచెర్ల: బేతంచెర్లతో పాటు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం సీతారాముల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ముసలాయిచెర్వు, ముద్దవరం, ఆర్ఎస్ రంగాపురం, పట్టణంలోని సంజీవనగర్ కాలనీల్లో సాంస్కృతిక కార్యక్రమాల మధ్య సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

గ్రామాల్లో చలి వేంద్రాలు



సోంపురం గ్రామంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాధమ్మ

డోన్ టౌన్: వేసవి నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మండల పరిధిలోని సోంపురం, ఉడుములపాడు గ్రామాల్లో శుక్రవారం చలివేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాధమ్మ, ఉప్పరి రాధ ఏర్పాటు చేసి ప్రారంభించారు. సోంపురం గ్రామ సర్పంచ్ రాధమ్మ తొలి రోజు మజ్జిగ పంపిణీ చేశారు.